# 34. స్థాయీ భేదం

కాత్యాయని తనగదిలో పచారులు చేస్తున్నది.

కిటికీ ఊచలలోంచి వెన్నెల లోపలికి వచ్చి, నేలమీద పరచిన వెండిచాపవలె కనిపిస్తోంది.

గది చాల విశాలమైనది. ఇరవై అడుగుల పొడుగు, పదహారడుగుల వెడల్పు గలది. అది, ముందు కాత్యాయని తాతగారి గది. వారు జడ్జిగా ఉన్నప్పుడు ఆ గది ఆయన స్టడీగా ఉండేది. రెండు వరుసలలో బీరువాలు, పెద్ద టేబిలు, ఒక చేతులున్న కుర్చీ అందులో ఉండేవి. ఆ గదిలోకి ఆయన ఎవరినీ రానిచ్చేవారుకారు. కనీసం కాత్యాయని మామ్మగారిని కూడా లోపలికి అడుగుపెట్టనీయలేదు. అతను ఏకాంతంగా ఎంతో రాత్రి వరకు కేసులు చదివి, తీర్పులు వ్రాసేవారు. అతని ఎదురుగా న్యాయదేవత విగ్రహం ఉండేది. ఆమెచేతిలో ఒకత్రాసు- కళ్లకు గంతలు- పాలరాతి విగ్రహమది.

ఎప్పుడో ఒకసారి అతను కాగితాలు చూస్తూ, ఎదుట, కాత్యాయని అరగంటనుండి నిలబడ్డ సంగతి కూడా గుర్తించలేదు. తలెత్తి ఎదురుగా నిలుచున్న మనుమరాలిని చూసి అతనన్నమాటలు ఆమెకు ఎప్పుడూ జ్ఞాపకముంటాయి.

" కాత్యాయనీ! ఈ గది ధర్మదేవతకు నిలయం. జటిలమైన సమస్యలు కూడా ఇక్కడ కూర్చుంటే పరిష్కారాన్ని పొందుతాయి. ఆలోచనలు ఈ గదిలో ఒక కొలికికి వస్తాయి. నేను ఉద్యోగం చేసినన్నాళ్లూ ఈ గదిలోకి రాకు. తరువాత నువ్వురాకపోతే నేనుండగలనా?''

ఎంత అభిమానంతో అన్నారాయన.

తాతగారు రిటైరయారు. ఆగదిలోని బీరువాలన్నీ మరో గదికి మార్పించారు. మామ్మగారికి, అతనికి అందులో మంచాలు, పక్కలు వేశారు. అప్పుడా గదిలోకి అందరూ వచ్చేవారు. తాతగారు చెప్పే రామాయణంలోని విశేషాలు వినడానికి, మామ్మగారి వీణావాదనకు తన్మయత చెందడానికి వచ్చేవారు.

అంతవరకూ న్యాయనిలయమైన ఆగది అటు తరువాత శారదా నిలయమయింది.

కాత్యాయని పచారులు చేస్తూ ఆలోచిస్తున్నది.

తన తండ్రి రఘురామయ్యగారు ఎందుకు న్యాయవాదవృత్తిని చేపట్టి తాతగారివలె

జడ్జీ కాలేదు. తండ్రిగారు చాలమేధావి. గణితశాస్త్రంలో అద్వితీయమైన ప్రతిభగలవారు. మామ్మగారు కొడుకును మెడిసిన్‌లో చేరమన్నారు. అతను మద్రాసులో గిండీ కాలేజీలో ఇంజనీరింగులో చేరారు. రాంకులలో పాసయి, ఉద్యోగంలోచేరి ఛీఫ్ ఇంజనీర్‌గా రిటైరయారు. తాతలనాటి నుంచి వస్తున్న పెద్దయింటికి మార్పులు చేసి అన్ని సౌకర్యాలు సమకూర్చారు. అప్పటినుంచీ కాత్యాయనికి తాతగారిగది దఖలుపడ్డది.

తొందరలో ఈ గదిని, ఈయింటిని విడిచి వెళి పోవాలి. పెళ్లయిన తరువాత ఆడపిల్లలు ఎన్నాళ్లు తమయిళ్లలో ఉండగలరు?

తనతల్లి, మామ్మగారు అందరూ అలా వచ్చినవాళ్లే. తను కూడా...

ఈ ఆలోచన వచ్చేసరికి ఆమెకు చెప్పరాని దుఃఖం వచ్చింది. కిటికీలోంచి చల్లని గాలి వస్తుంది. పెరటిలో పెద్ద బాదంచెట్టు, రెండు జామచెట్లు ఉన్నాయి. వాటిమీదికి చిలుకలదండ్లు వచ్చి పళ్లను కొరికి పోతుంటాయి. చెట్లనీడ పడనిచోట వేసిన సన్నజాజితీగ పందిరినిండా ప్రాకింది. ఉదయం కాగానే ఇవన్నీ తనకి స్వాగతం పలుకుతూ, దినమంతా హాయిగా గడపమని ఆశీర్వదిస్తాయి.

తాను వెళ్లబోయే యింటికి పెరడేలేదు. జాగా తక్కువవడంనుంచి అంతస్తుమీద అంతస్తులేపాడా యింజనీరు. మరిచెట్లెక్కడ? చిలకలెక్కడ?

ఈ యిబ్బందులన్నీ కిందటి సోమవారం మొదలయాయి. శాస్త్రిగారి భార్య, కొడుకు, ఇద్దరు ఆడపిల్లలు పెళ్లిచూపులకు వచ్చారు.

కూతురిని ముస్తాబుచేయడానికి రఘురామయ్యగారి భార్య జానకమ్మ ప్రయత్నించింది. కాత్యాయని మాత్రం శ్రద్ధ చూపించలేదు. కాలేజీనుంచి ఆమె తిరిగి వచ్చేసరికి పెళ్లిచూపులకు వచ్చినవాళ్లు అరగంటయి ఆమెకోసం ఎదురుచూస్తున్నారు. అందుచేత ఎటువంటి ముస్తాబుకు అవకాశంలేకపోయింది.

అసలు, కాత్యాయనికి ముస్తాబు దేనికి? చారెడుకళ్లు, విశాలమైన ఫాలం, పొడవాటి జడ, ఏపయిన మనిషి. మొదటిసారి ఆమెను చూసినవాళ్లు ఆమె సౌందర్యానికి మాటలు దక్కిఉండిపోతారు.

కాత్యాయనికి పెళ్లిచూపుల సంగతి తెలియదు. ఆఖరి పీరియడ్ ఏమీపనిలేదనీ లైబ్రరీలో పుస్తకాలు తిరగేస్తూ కూర్చుంది.

శాస్త్రిగారు మధ్యాహ్నం రెండు గంటలకు వచ్చారట. వాళ్ళ రెండో అబ్బాయి యింజనీరింగు పరీక్షలు పాసయి, టౌన్‌ప్లానింగు ఆఫీసరుగా అయిదేళ్ల నుండి పనిచేస్తున్నాడు. ఉద్యోగంలో స్థిరపడ్డాడు. ఇద్దరు చెల్లెళ్లకు పెళ్లయిన తరువాత తనపెళ్లికి ఒప్పుకున్నాడు. ఈ సంగతి శాస్త్రిగారు మొన్ననే రఘురామయ్య గారితో చెప్పారు. పిల్లడు మంచి ఉద్యోగమే చేస్తున్నాడు. ఇల్లూ, వాకిలీ ఉన్నాయి. చూడడానికి కూడా బాగుంటాడు. కాత్యయనికి సరిపడిన

వయసే. ఇవన్నీ రఘురామయ్యగారు భార్యతో ఆలోచించి ఏకబురూ చెప్తానన్నారు.

భార్యాభర్తలు ఈ విషయం కాత్యాయనితో చెప్పేలోపునే శాస్త్రిగారి కుటుంబం పెళ్లిచూపులకు వచ్చింది. మరో రెండు సంబంధాలు వచ్చాయని,రఘురామయ్యగారి కుటుంబం గురించి బాగా తెలిసి ఉండడంచేత కాత్యాయనిని లాంఛనప్రాయంగా మంచి రోజున చూస్తే చాలునని, ఏదో వంక బెట్టి, వాళ్లు రఘురామయ్యగారి యింట మీద దాడిచేశారు.

కళ్యాణం కలిసివస్తే ఇటువంటి పనులే జరుగుతూంటాయని జానకమ్మ కూతురికి బోధపరచి పెళ్లి చూపులకు కూర్చోబెట్టింది.

పెళ్లికొడుకు అట్టే మాట్లాడలేదు.

పెళ్లికొడుకుతల్లి కాత్యాయనిచేత మాట్లాడించింది. పిల్లకి మూగి, నత్తి ఉందేమోనని అలా చేశానని ఆమె అంది. పెళ్లికొడుకు కొంచెం చిరాకుపడి అన్నాడు.

"కాలేజీలో ఇంగ్లీషు లెక్చరరుగా పనిచేస్తున్న అమ్మాయికి మాటలు రాకపోతే ఎలా?"

"సంగీతమొచ్చా?" పెళ్లికొడుకు చెల్లెలొకతె ప్రశ్నవేసింది.

"చాల సార్లు ఈమె వీణ కచేరీలు చేసింది. అందుచేత సంగీతం వచ్చినట్లే" అన్నాడు పెళ్లికొడుకు.

'నాకీ సంగీతాలు, చదువులు అక్కరలేదు. నా ప్రశ్నలేవో తెలుసా? వంటా, వార్పూ వచ్చా? ఇల్లు దిద్దుకోగలదా? అన్నిటి కన్న ముఖ్యం. నలుగురున్న యింట్లో కలిసిఉండగలదా?' పెళ్లికొడుకు తల్లి అడిగింది.

"అన్నీ తెలిసిన పిల్ల. మరేం పరవాలేదు." అంది జానకమ్మ, కొంగు భుజం మీద వేసుకుంటూ.

పళ్లు, మిఠాయి, పూలు తేడానికి బజారుకుపోయిన రఘురామయ్యగారు రావడం కొంచెం ఆలస్యమయింది. తనమెడలోని నగలను ప్రదర్శించి, తాను చెప్పవలసిన గొప్పలన్నీ చెప్పి, పెళ్లికొడుకు తల్లి ఈ సమయాన్ని బాగా వినియోగించుకుంది. ఆమె తమ ఆస్తిపాస్తుల గురించి, సంపద గురించి చెప్పింది. ఆవిడ వంటిమీద పాతిక తులాల బంగారముంది. అందులో ఓ పదితులాలు కోడలివంతు. వాళ్లున్న యిల్లు అందరికీ తెలిసిందే. అందులో రెండో అంతస్తు ను పెళ్లికొడుకు ప్రత్యేకంగా తన కోసమే కట్టించుకున్నాడు. అతని దగ్గిరకి తరచు పార్టీలు వస్తుంటారు. వారితో మాట్లాడడానికి ఒక గది, అటాచ్డ్ బాత్‌తో పెద్ద బెడ్‌రూము ఆ రెండో అంతస్తులో ఉన్నాయి. అది బెడ్‌రూముకాదు. సినిమా సెట్టింగులకు మించిన హంగు లున్నాయి. దానికి అన్ని ఆధునికమైన ఫిట్టింగులు, ఫర్నిచరు, ఫోమ్ పరుపులు, చాందినీలు, నేలను పరిచే తివాసులు, కళ్ల వైభవంగా రాబోయే భార్యకోసం అలంకరించాడు. వాళ్లింట్లోకి అడుగు పెట్టినకోడలు, మెడ తిరగకుండా నగలు పెట్టుకొని, పనసపళ్లలాంటి బిడ్డలనుకంటుంది. ఇంతకన్న ఆడపిల్లకేం కావాలి?

ఈ విషయాలన్నీ కాత్యయని మనసులో తెరమీద బొమ్మలవలె కదులుతున్నాయి. మాటలన్నీ చెవులలో గింగురుమంటున్నవి.

రఘురామయ్యగారు బజారునుండి వచ్చినకొద్ది సేపటిలో తతంగమంతా ముగిసింది. పిల్లను నచ్చుకున్నామని పెళ్లికూతురు తల్లి చెప్పింది. జాతకాలు కూడా సరిపడ్డాయి. కాత్యాయని పుట్టినప్పుడు రఘురామయ్యగారు శాస్త్రిగారి చేత జాతకం వేయించారు. తొందరలోనే ముహూర్తాలు పెట్టిస్తామన్నారు. పెళ్లికి అన్ని ఏర్పాట్లు చేయమని చెప్పి వాళ్ల వెళ్లిపోబోతుంటే , కాత్యాయని ఒక మాటంది.

“ఆలోచించుకోడానికి నాకో వారం రోజులు గడువివ్వండి.”

“దానికేం! మహారాజులా ఆలోచించుకో! కోరి వచ్చిన మంచి సంబంధం ఎవరు కాదంటారు?'' అంది పెళ్లికొడుకు తల్లి.

రేపు సోమవారం. ఉదయమే కాత్యాయని తన నిర్ణయం తల్లిదండ్రులకు తెలియజేయవలసి ఉంది.

కాత్యాయనికి ఆడంబరాలు సరిపడవు. పెద్దింటిపిల్ల. ఎవరితో మాట్లాడినా వినయంగా వ్యవహరిస్తుంది. కాలేజీలో అమ్మాయిలకు పాఠం చెప్తుంటే, వాళ్లందరూ తన్మయులై వింటారు. నాలుగు సంవత్సరాలయి ఉద్యోగంలో చేరింది. అటు విద్యార్థినులకు, యిటు తోటి లెక్చరర్లకు ఆమె తలలో నాలుకయింది.

ఆమె తీరిక దొరికినప్పుడు స్టూడెంట్సుతో చాల సంగతులు చెప్పేది. పెళ్లిళ్లకు చాల డబ్బు వృధాగా ఖర్చు చేస్తున్నామని, పాత ఆచారాలను కొంచెం సవరించి తక్కువ ఖర్చుతో చేసుకుంటే బాగుంటుందని చెప్పేది. అటువంటిది, ఇప్పుడు పెళ్లికొడుకు తల్లి అన్న మాటలు ఆమెకే సవాలుగా నిలిచాయి.

“చూడండి వదినగారు! మాకుర్రాడు మంచి ఉద్యోగం చేస్తున్నాడు. వాడికి చాలమంది పెద్దపెద్ద వాళ్లు స్నేహితులున్నారు. పెళ్లికి అయిదు వందలమంది వస్తారు. వాళ్లకు లోటు రాకుండా చూసుకోవాలి.”

దానికి జానకమ్మ తలూపింది.

“ వదినగారు! మావాడికి రెండు మూడు సంబంధాలొచ్చాయి. ఒకరు రెండు లక్షల కట్నమంటే, మరొకరు మూడు లక్షలన్నారు. మీతో వియ్యమందాలని మావారి కోరిక. కాబట్టి ఒక లక్షకు తక్కువకాకుండా కట్నం యివ్వాలి. లాంఛనాలు మరో ఏభైవేలు”.

దీనికి కూడా జానకమ్మ అంగీకరించింది.

ఇవన్నీ బాగానే ఉన్నాయి. పెళ్లి కొడుకుకి అంత ధర ఉన్నదన్నమాట. రఘురామయ్యగారు కోరిన మేరకు కట్నం ఇవ్వగల స్తోమత గలవారు. తన డబ్బును,ఉన్న ఒక్క కూతురి వివాహం కింద ఖర్చుపెట్టడానికి అతను వెనుకాడరు.

ఇంక తన కెందుకీ ఆందోళన?

పెళ్లిచూపులైన మూడోరోజున, ప్రిన్సిపాలుగారు ఒంటరిగా తన గదిలో ఉన్నప్పుడు,

కాత్యాయని ఆమెను చూడడానికి వెళ్ళింది.

"మీరు తప్పకుండా కలియమని అటెండెంటుతో కబురు పంపించారు. మాడమ్! ఏదేనా విశేషమా?"

"కాత్యాయనీ! కూర్చో! కాలేజీలో కొత్త భవనాలు కట్టడానికి ప్లానులు వేయించి మునిసిపల్ ఆఫీసుకు పంపాము. నిన్న టౌన్‌ప్లానింగ్ ఆఫీసరుగారు వచ్చి ఒక అరగంటసేపు నాతో అన్ని విషయాలు మాట్లాడారు. అప్పుడాయన ఒక సంతోషమైన విషయం చెప్పారు. నిన్ను ఆయన పెళ్లాడుతున్నారట!"

కాత్యాయని నవ్వి ఊరుకుంది.

"అంతే కాకుండా, పెళ్లయిన మరుచటి క్షణమే,నీచేత లెక్చరరు ఉద్యోగానికి రాజీనామా ఇప్పిస్తానన్నారు. ఈ సంగతి తలచుకుంటే నాకు కష్టంగా ఉంది. నువ్వంటే స్టూడెంట్సుకి చాల గౌరవం. ఈ నష్టం కాలేజీకే గాక, విద్యార్థినులకు కూడా వర్తిస్తుంది".

కాత్యాయని కుర్చీ నుంచి లేచి, తలవంచుకొని వెళ్లిపోయింది.

రెండు రోజుల కింద కాత్యాయని గీతామందిరానికి వెళ్లింది. అక్కడే గానసభలు , కచేరీలు జరుపుతారు. మరొక్క పదిహేను రోజులలో ఆమె అక్కడ వీణ వాయించి కచేరీ చేయవలసి ఉంది.

సెక్రెటరీ వేణునాదం ఒక్కడూ ఆఫీసులో ఉన్నాడు. అతనికి నమస్కారం పెట్టి, ఎదురుగానున్న కుర్చీమీద కాత్యాయని కూర్చుంది.

"కాత్యాయనిగారు! వచ్చేనెల పదో తారీకున జరగవలసిన మీ ప్రోగ్రాము రద్దయింది"

"కారణం?"

"టౌన్‌ప్లానింగ్ ఆఫీసరుగారు పనిమీద నిన్నను ఇక్కడికి వచ్చారు. మీకచేరీగురించి అంటించిన పోస్టరు చూసి అతను మండిపడ్డారు. మరో పదిరోజులలో మిమ్మల్ని పెళ్లాడుతున్నారని, గానసభలు వీణావాద్యాలు తనకు సరిపడవని, ఈ ప్రోగ్రాము జరిగేది కాదని, వెంటనే దీనిని రద్దు చేసి ప్రెస్‌కి తెలియజేయమన్నారు."

కాత్యాయని ఏమీ జవాబు చెప్పలేదు. అక్కడ నుంచి వెళ్లిపోయింది.

శనివారం సాయంకాలం, కాత్యాయని ఇంటికి బయటు దేరుతుంటే కాలేజి అటెండెంటు రామశర్మ కలిశాడు. అతని మాటలామె మరచిపోలేదు.

"నేను యివాళ పొద్దున్న శాస్త్రిగారింటికి యజ్ఞోపవీతాలకోసం వెళ్లవలసి వచ్చింది. అతను ఏదో పనిమీద ఉంటే, ఒకపావుగంట వరకువీధి గదిలో కూర్చున్నాను. ఆయిల్లో సంతబజారులా ఉంది. అందరూ సినీమాడైలాగులే పలుకుతున్నారు. వాళ్లందరి మధ్య, కాబోయేపెళ్లికొడుకు కూర్చొని వాళ్ల మాటలకు తెగ మురిసిపోతున్నాడు. మీరు ఆయింటికోడలిగా వెళ్తున్నారంటే నాకు బాధగా ఉంది, మాడమ్"

కాత్యాయని కిటికీ దగ్గిర నిలబడింది. పాదరసపు వరద వలె వెన్నెల పెరటిని కప్పేసింది. సన్నజాజి పందిరి నుండి మందమైన సువాసన గాలిలో తేలి లోనికి వస్తున్నది.

పొద్దున్న పెరట్లో తిరుగుతుంటే జామచెట్లనిండా పళ్లేకనిపించాయి. బాదంచెట్టు నిండా, ముదురుకుంకుమ రంగులో, ఆకులు కనిపించకుండా పళ్లు- పొద్దున్నే రామచిలుకల పలుకులకు తెలివొస్తుంది. పిమ్మట- తనూ- తన కాలేజి- తన విద్యార్థినులు- తన పుస్తకాలు- తనవీణ - అంతా మామూలే!

* * *

## ఒక సమీక్ష

కాత్యాయని కాలేజీ నుంచి తిరిగి వచ్చేసరికి పెళ్ళి చూపులకు వచ్చిన వాళ్ళు అప్పటికే అరగంట నుండి ఆమె కోసం ఎదురు చూస్తూన్నారు. ఆమెకు తను ప్రత్యేకంగా ముస్తాబు కావడానికి అవకకాశం లేకపోయింది.అయినా కాత్యాయనికి ముస్తాబు దేనికి? చారెడు కళ్ళు విశాలమయిన ఫాలం, పొడవాటి జడ, మొదటి సారి ఆమెను చూసినవాళ్ళు ఆమె సౌందర్యానికి మంత్రముగ్ధులయిపోతారు!

పెళ్ళికొడుకు టౌన్ ప్లానింగ్ ఆఫీసరు. ఆస్తిపరుడు.

కాత్యాయనికి ఆడంబరాలు సరిపడవు. పెళ్ళివారు ఆడంబరంగా పెళ్ళి చేయమన్నారు. ఆమెకు వినయం ఎక్కువ. పెళ్ళికొడుకు అహంకారి. ఆమెకు సంగీతమంటే ప్రాణం పెళ్ళికొడుక్కి సంగీతం అయిష్టం. కాలేజీ లెక్చెరరుగా ఆమె విద్యార్థుల మన్ననలందుకుంది. అతడి హోదాకు భార్య ఉద్యోగం చేయడం నప్పదు.

అతణ్ణి పెళ్ళి చేసుకుంటే ఆమె సినిమాసెట్టింగులాంటి ఇంట్లో, మెడనిండా నగలు వేసుకుని తిరుగుతూ పనసపళ్ళలాంటి బిడ్డల్ని కంటుంది. ఇంతకన్నా ఆడపిల్లలకేం కావాలి?

కాత్యాయని తల్లిదండ్రులు - ఈ పెళ్ళికి ఒప్పుకుని జరిపించగల స్థితిలో ఉన్నారు. కాత్యాయనే ఒప్పుకోవాలి.

తొందర్లో తన గదినీ, ఇంటినీ పెరటినీ విడిచి ముక్కూ ముఖం తెలీని వ్యక్తితో వెళ్ళిపోవాలి. ఒకప్పుడు తన తల్లీ అలా ఫీలయిందా? ఫీలు కాలేదంటే అది నాన్న గారి గొప్పతనమా -? ఇదీ కాత్యాయని ఆలోచన.

ఈ కథలో రచయిత కాత్యాయని వ్యక్తిత్వాన్ని ప్రదర్శించి ఊరుకుంటారు. అటుపైన చక చకా సంఘటనలు జరిగిపోతాయి. ప్రతి సంఘటనకూ కాత్యాయని ఆలోచన ఏమిటో తెలియదు. కానీ పాఠకుడు కాత్యాయని తరుపున ఆలోచిస్తాడు. స్పందిస్తాడు. ఎందుకో అన్న విశ్లేషణ లేకుండా కాత్యాయని ఏం చేయాలో స్పష్టంగా తెలుస్తుంది.

ఇతివృత్తం అతి సామాన్యమైనది. కథనంసామాన్యమైనది. కథ మాత్రం అసామాన్యం. అనుభవజ్ఞులైన రచయిత సామాన్యమైన కథను తన తేజంతో ఎలా ప్రకాశింపజేస్తాడో తెలుసుకునేందుకు కాబోయే కథకులు తప్పక చదవాల్సిన ఈ కథ పేరు 'స్థాయీభేదం.' రచయిత "ఘండికోట బ్రహ్మాజీరావుప్రచురణ అమృత కిరణ్ పక్షపత్రిక, 16-05-1995.